ప్రజా పాలనలో ఆరోగ్య ప్రగతి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, వైద్యులు, సిబ్బందిని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ఆరోగ్యశాఖ కీలక పాత్ర పోషించిందని, సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రివర్గం కూడా శాఖ పనితీరును ప్రశంసించిందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య సేవలను విస్తరిస్తోందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ కృషి కొనసాగిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

ఆరోగ్యశాఖ సాధించిన ప్రధాన మైలురాళ్లు ఇవే

* హెల్త్ అవేర్‌నెస్ వీక్: ఏప్రిల్ 6-11 వరకు 20కి పైగా కార్యక్రమాలతో ప్రజారోగ్యం, మాతాశిశు సంరక్షణ, వ్యాధుల నివారణపై విస్తృత అవగాహన కల్పించారు.
* ఫుడ్ సేఫ్టీ: నెక్లెస్ రోడ్డులో వాకథాన్, నేచర్ క్యూర్ ఆసుపత్రిలో ఈట్ రైట్, మిల్లెట్ మేళాలు నిర్వహించి సురక్షిత ఆహార అలవాట్లపై చైతన్యం తెచ్చారు.
* క్యాన్సర్ సంరక్షణ, ఏఐ: నిమ్స్‌లో రూ.33 కోట్లతో లినాక్ సేవలు ప్రారంభించారు. క్యాన్సర్‌ను నోటిఫైయబుల్ వ్యాధిగా మార్చి స్టేట్ క్యాన్సర్ రిజిస్ట్రీ తెచ్చారు. ఆస్ట్రాజెనెకాతో కలిసి 20 ఆసుపత్రుల్లో ఏఐ ఆధారిత లంగ్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభించారు.
* ట్రామా కేర్ పాలసీ: ప్రమాద బాధితుల కోసం 109 ట్రామా సెంటర్లు, 31 క్రిటికల్ కేర్ బ్లాక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నాగర్‌కర్నూల్‌లో కొత్త బ్లాక్ ప్రారంభించగా, కొండాపూర్‌లో శంకుస్థాపన చేశారు.
* డిజిటల్ సంస్కరణలు: పారదర్శకత కోసం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ పోర్టల్‌తో పాటు పీసీపీఎన్‌డీటీ, ఏఆర్టీ, సరోగసి పోర్టల్‌ను పూర్తిగా డిజిటలైజ్ చేశారు.
* మాతాశిశు ఆరోగ్యం: సేఫ్ మదర్‌హుడ్ డే ద్వారా గర్భిణుల సంరక్షణ, నార్మల్ డెలివరీల ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టారు. నర్సింగ్ కాలేజీల్లో మిడ్‌వైఫరీ కేంద్రాలను విస్తరిస్తున్నారు.
* మానసిక ఆరోగ్యం, డీఅడిక్షన్: ఎర్రగడ్డలో డీఅడిక్షన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తో పాటు, 35 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో కౌన్సెలింగ్ సెంటర్లు, స్పెషల్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్లను తెచ్చారు.
* ప్రత్యేక వైద్య శిబిరాలు: కేబుల్ బ్రిడ్జిపై హెచ్ఐవీ అవగాహన మానవహారం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్యాంపులు, ఖైదీల కోసం జైళ్లలో ప్రతి 3 నెలలకొకసారి స్పెషలిస్ట్ వైద్య శిబిరాల విధానాన్ని తెచ్చారు.
* డ్రగ్ కంట్రోల్, ఆయుష్: యాంటీబయాటిక్స్ దుర్వినియోగానికి వ్యతిరేకంగా డ్రగ్ కంట్రోల్ డే నిర్వహించి నకిలీ మందులపై కఠిన చర్యలు చేపట్టారు. యోగా, ఆయుష్ సేవలను విస్తృతంగా ప్రచారం చేశారు.
* భారీగా నియామకాలు: ఇటీవల 866 మంది వైద్యులు, 2,322 మంది నర్సింగ్ ఆఫీసర్ల భర్తీ పూర్తి చేశారు. దీంతో గత రెండున్నరేళ్లలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య 15 వేలకు చేరింది.
* వైద్యుల సంక్షేమం, మెడికల్ హబ్: కోఠిలో డాక్టర్స్ భవనాన్ని పునరుద్ధరించారు. మహబూబ్‌నగర్‌ను దక్షిణ తెలంగాణ మెడికల్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు మౌలిక వసతులు బలోపేతం చేస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను నెలకు
రూ.500 కోట్ల చొప్పున విడుదల చేయాలి
లక్షలాది మంది బీసీ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు : జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి సంబంధించి గతంలో అమలులో ఉన్న జీవో నెం.7 రద్దు అనంతరం ఏర్పడిన గందరగోళ పరిస్థితులపై ప్రభుత్వం వెంటనే స్పష్టతనిస్తూ ప్రత్యేక విధాన ప్రకటన విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెం.7 రద్దు తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హతలు, చెల్లింపుల విధానం, పెండింగ్ బకాయిల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించకపోవడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు తీవ్ర అయోమయంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నత విద్యను కొనసాగిస్తున్నారని పేర్కొన్న గుజ్జ సత్యం, విధానపరమైన స్పష్టత లేకపోవడం వల్ల వారి విద్యా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన విధాన ప్రకటన చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన, బీసీ సంఘాలతో కలిసి విస్తృత ఉద్యమ కార్యాచరణ చేపడతామని గుజ్జ సత్యం హెచ్చరించారు.

కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడికి సన్మానం

విశ్వంభర, నల్లగొండ: శనివారం నల్గొండ జిల్లా కేంద్రానికి విచ్చేసిన కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు మెరుగు మధు గారిని బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్, గౌరవ సలహాదారు పాముల అశోక్ ముదిరాజ్ లు మాట్లాడుతూ, యువత సినిమాలను కేవలం వినోద సాధనంగా కాకుండా సమాజానికి మేలు చేసే అంశాలను గ్రహించే వేదికగా చూడాలని సూచించారు. సినిమాల్లో ప్రదర్శించే సానుకూల సందేశాలు, క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను యువత ఆచరణలో పెట్టి సమాజ హితం కోసం కృషి చేయాలని కోరారు. అదే సమయంలో సినిమాల్లో కనిపించే ప్రతికూల పాత్రలు, హింసాత్మక ధోరణులు, చెడు అలవాట్లను అనుకరించడం వల్ల యువత భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. యువత మంచి విషయాలను స్వీకరించి వ్యక్తిత్వ వికాసంతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పడాలని వారు పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు బోళ్ల నాగరాజు, నారగోని వెంకట్, వసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అబార్షన్ కేంద్రంపై పోలీసుల దాడి

- అనుమతులు లేకుండా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహణ
- మహిళల ప్రాణాలతో చెలగాటం
- డెకాయ్ ఆపరేషన్‌లో వెలుగులోకి అక్రమ కార్యకలాపాలు

విశ్వంభర, నాగోల్ : నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపురి కాలనీలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో అక్రమంగా అబార్షన్లు చేస్తున్న వ్యవహారం పోలీసుల డెకాయ్ ఆపరేషన్‌లో బట్టబయలైంది. మహిళల ఆరోగ్యంతో పాటు వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే విధంగా ఎలాంటి వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండానే కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం, జైపురి కాలనీలో రోడ్ నెంబర్ 2లో శంకర్ ఇంటికి చెందిన రెండు షట్టర్లను అద్దెకు తీసుకుని బండారు వెంకట లక్ష్మి "కేసరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్" పేరుతో గత కొంతకాలంగా కేంద్రాన్ని నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడ గర్భిణీ మహిళలకు అక్రమంగా అబార్షన్లు నిర్వహిస్తున్నట్లు తెలిసి ఎస్‌వోటీ ఎల్బీనగర్ బృందం, నాగోల్ పోలీసులు సంయుక్తంగా డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా గర్భిణీ మహిళగా ఓ మహిళా కానిస్టేబుల్‌ను కేంద్రానికి పంపించారు. అక్కడ ఉన్న వీర రేవతి (50) అనే మహిళ ఎలాంటి వైద్య విద్యార్హతలు లేకపోయినా, ప్రభుత్వ అనుమతులు లేకపోయినా అబార్షన్ చేయడానికి ముందుకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. గర్భిణీలను తనకు పరిచయమున్న స్కానింగ్ సెంటర్లకు పంపించి, స్కానింగ్ నివేదికల ఆధారంగా అబార్షన్‌లు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా మహిళా కానిస్టేబుల్ వద్ద నుంచి రూ.10 వేల నగదు తీసుకుని, కొన్ని ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అబార్షన్ చేసేందుకు సిద్ధమవుతుండగా, ముందస్తు ప్రణాళిక ప్రకారం అక్కడే ఉన్న పోలీసు బృందం జోక్యం చేసుకుని చర్యలు చేపట్టింది. దీంతో అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న పలు రికార్డులు, వైద్య సామగ్రి, మందులు, ఇతర ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అక్రమంగా వైద్య సేవలు అందించడం, గర్భస్రావాల నిర్వహణ, సంబంధిత చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతులు పొందిన ఆసుపత్రులు, అర్హత కలిగిన వైద్యుల వద్ద మాత్రమే వైద్య సేవలు పొందాలని, ఇలాంటి అనధికారిక కేంద్రాలను ఆశ్రయించి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, అక్రమ వైద్య కేంద్రాలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరు. పరచి నట్లు నాగోల్ ఇన్స్పెక్టర్ మక్బుల్ జానీ తెలిపారు.

సాగుతున్న డ్రైనేజి పనులు

- వాటర్ వర్క్స్ అధికారుల అలసత్వం
- గుత్తేదారుడి నిర్లక్ష్యం
- పనులు సాగక కాలనివాసులు, వాహనదారులు ఇక్కట్లు

విశ్వంభర, ఎల్బీనగర్ : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది అభివృద్ధి పనుల తీరు. అభివృద్ధికి నిధులు ఉన్నా వాటిని సకాలంలో ఖర్చుచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న వైనం మనకు కనబడుతుంది. వాటర్ వర్క్స్ అధికారుల అలసత్వం వారి వ్యవహార శైలి అర్థం కానీ పరిస్థితి. సరూర్ నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్ కాలనీ ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదుర్కొంటున్న డ్రైనేజి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిధులు మంజూరు చేయించింది. పనులు ప్రారంభించి నలభై రోజులలో పనులు పూర్తి చేయాలని ఆదేశించినా ఫలితం లేదు. మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోకి వచ్చే సరూర్ నగర్ డివిజన్ లోని హుడా కాంప్లెక్స్ కాలనీలో డ్రైనేజి నిర్మాణం పనులను మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గత ఏప్రిల్ నెల 10 న శంకస్థాపన చేసి ప్రారంభించారు. సరూర్ నగర్ సర్కిల్ వాటర్ వర్క్స్ నిధులు రూ. 55 లక్షలు మంజూరు చేయించారు. ఎప్పుడు ప్రజల బాగుకోసం, అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే వర్షాకాలం రాకముందే 40 రోజులలో పనులు పూర్తిచేయాలనీ అధికారులు, గుత్తేదారుడిని ఆదేశించారు. అందుకు సుముఖత వ్యక్తం చేసినా నేటివరకు పనులు పూర్తి చేయలేదు. కనీసం సగం వరకు కూడా పనులు చేయకపోవడం పట్ల కాలనీ ప్రజలు విమర్శిస్తున్నారు.

అధికారుల అలసత్వం

వాటర్ వర్క్స్ అధికారుల అలసత్వం వలన గుత్తేదారుడు నేటివరకు చేసిన పనులు నాసిరకంగా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. చకచకా చేపట్టాల్సిన పనులు ఆలస్యంగా జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనా పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. వర్షాలు పడితే నీరంతా ఒకచోట చేరి కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితి వస్తుంది. తిరిగి సమస్య మెదటికి రాకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోరడానికి సరూర్ నగర్ సర్కిల్ వాటర్ వర్క్స్ డిజిఎం చందు నాయక్ ను ఫోన్ లో సంప్రదించగా అందుబాటులో రాలేదు.

చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలి
ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

విశ్వంభర, ఎల్బీనగర్ : చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండటంపై ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న పనులను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎల్.బి.నగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఏ.ఏ.సి.ప్రాజెక్ట్ ఈ.ఈ. రోహిణితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, దాదాపు రెండున్నర నెలల క్రితం ప్రారంభమైన రోడ్డు మరమ్మత్తు పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు ఆలస్యం కావడం వల్ల హయత్‌నగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.యూటర్న్ కోసం ఎల్.బి.నగర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రయాణ సమయం పెరగడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు కూడా అధికమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ వర్క్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ బైబిల్ కాలేజ్‌పై అర్ధరాత్రి అక్రమ చొరబాటు దారుల ప్రయత్నం

- మేడ్చల్ పోలీసుల దౌర్జన్యం.. నిందితుడికి ఖాకీల అండ
- బీబీసీ ఆస్తుల కబ్జాకు మాజీ సభ్యుడి కుట్ర.. ఎమ్మెల్యేల అండదండలు...
- 56 ఏళ్ల చరిత్ర గల విద్యాసంస్థపై రాజకీయ వేధింపులు.. సీఎంను కలవనున్న బోర్డు సభ్యులు.
- మేడ్చల్ పోలీసుల తీరుపై భారత్ బైబిల్ కాలేజ్ యాజమాన్యం తీవ్ర ఆగ్రహం

విశ్వంభర, మేడ్చల్ : మేడ్చల్‌లోని ప్రముఖ విద్యాసంస్థ 'భారత్ బైబిల్ కాలేజ్' (BBC) క్యాంపస్‌లోకి నిన్న అర్ధరాత్రి జరిగిన అక్రమ చొరబాటు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సంస్థ నుండి గతంలోనే తొలగించబడిన మాజీ సభ్యుడు జోబి ఎల్. రెడ్డి (జాబ్ ఎల్. రెడ్డి) కాలేజీ ఆస్తులను అక్రమంగా ఆక్రమించుకుని, విక్రయించాలనే దురుద్దేశంతో ఈ దౌర్జన్యానికి ఒడిగట్టాడని కాలేజీ బోర్డు సభ్యులు, యాజమాన్యం తీవ్రంగా ఆరోపించారు. ఈ అక్రమ చొరబాటుకు మేడ్చల్ పోలీసులు పూర్తిస్థాయిలో సహకరించడంపై యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బీబీసీ బోర్డు సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిన్న రాత్రి జోబి ఎల్. రెడ్డి కాలేజీ క్యాంపస్‌లోకి చొరబడటానికి ప్రయత్నించగా, అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అయితే, మేడ్చల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (SI) సురేష్ స్వయంగా రంగంలోకి దిగి, నిందితుడికి అండగా నిలిచారు. క్యాంపస్ గేట్లు తెరవకపోతే సిబ్బందిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేస్తామని ఎస్ఐ తీవ్ర పదజాలంతో బెదిరించారని బోర్డు సభ్యులు ఆరోపించారు.గతంలోనే జోబి ఎల్. రెడ్డిపై మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫోర్జరీ, చీటింగ్ కేసులకు సంబంధించి రెండు తీవ్రమైన క్రిమినల్ కేసులు (FIR No. 701/2025, FIR No. 1090/2025) నమోదయ్యాయి. దర్యాప్తులో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేయాల్సింది పోయి, సివిల్ వివాదంలో పోలీసులు అతనికి కొమ్ముకాయడం వెనుక అంతర్యమేమిటి?" అని కాలేజీ యాజమాన్యం ప్రశ్నించింది. ఈ భూఆక్రమణ ప్రయత్నం వెనుక కొంతమంది స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల హస్తం ఉందని యాజమాన్యం బహిరంగంగా ఆరోపించింది. రాజకీయ నాయకులు తమ అధికారాన్ని ఉపయోగించి పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని, అందులో భాగంగానే కాలేజీలో పనిచేస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గడిచిన 56 సంవత్సరాలుగా 3,670 మందికి పైగా ఉన్నత విద్యను అందించిన ఘన చరిత్ర భారత్ బైబిల్ కాలేజీకి ఉందని, అలాగే పేద పిల్లల కోసం నాజారెన్ గ్రామర్ స్కూల్‌ను కూడా నడుపుతున్నామని.. ఇలాంటి పవిత్రమైన విద్యా, ఆధ్యాత్మిక సంస్థలను అక్రమార్కుల నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు గుర్తుచేశారు.ఈ రాజకీయ వేధింపులు పోలీసుల అక్రమ ప్రవర్తనపై తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రిని కలిసి త్వరలోనే అధికారికంగా వినతిపత్రం సమర్పించనున్నట్లు బీబీసీ బోర్డు ప్రతినిధులు వెల్లడించారు. అంతేకాకుండా, హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో త్వరలోనే భారీ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, నిందితుడితో చేతులు కలిపిన రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు, పోలీసు అధికారుల పేర్లను ఆధారాలతో సహా బహిరంగపరుస్తామని హెచ్చరించారు. అమాయక సిబ్బందిని భయాందోళనలకు గురిచేస్తున్న అక్రమార్కులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

విశ్వంభర, నాగోల్ : నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు అపహరించిన ఘటన చోటుచేసుకుంది. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్ కాలనీ రోడ్ నంబర్2లో నివాసముంటున్న పాశం శ్యామల (65) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా ఉదయం 4 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఆమె ఇంటి తలుపు తట్టాడు. నిద్రమత్తులో ఉన్న శ్యామల తలుపు తెరవగానే ఆ వ్యక్తి ఆమె మెడలో ఉన్నసుమారు 3 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. భర్త మృతి చెందడంతో శ్యామల కింద అంతస్తులో ఒంటరిగా నివసిస్తుండగా, ఆమె కుమారుడు పై అంతస్తులో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రుద్విర్ ఆదర్శంలో దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

అడ్మిషన్లు ఫుల్..వసతులు నిల్!

విశ్వంభర, సరూర్ నగర్ : సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అడ్మిషన్లు పోటెత్తుతున్నాయి. ఇప్పటికే ఫస్ట్ ఇయర్‌లో వివిధ కోర్సులు పూర్తి చేసుకుని, సెకండ్ ఇయర్‌లో అడుగుపెట్టిన వారు 418 మంది ఉన్నారు. కేవలం పది రోజుల్లోనే 272 కొత్త అడ్మిషన్లు పూర్తి అయ్యాయి. మరో 200 అడ్మిషన్లు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా. విద్యార్థుల నిష్పత్తి మేరకు మౌలిక సదుపాయాలు లేకపోవడం ఇబ్బందిగా మారింది. బోయ్స్‌కి ప్రత్యేక టాయ్‌లేట్స్ లేకపోవడంతో బహిరంగ ప్రదేశాల్లోనే మలమూత్ర విసర్జన చేయాల్సి వస్తోంది. ఒక్కో ఇరుకు గదిలో రెండు తరగతులకు క్లాసులు బోధించాల్సి వస్తోంది.

మొదలెట్టి మూడేళ్లైంది..

ప్రస్తుతం కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఏ అండ్ టీ, కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 418 మంది చదువుతున్నారు. ఇక్కడ చదువుతున్న నిరుపేద విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2022లో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో అదనపు గదుల నిర్మాణం చేపట్టింది. పనులు మొదలు పెట్టి మూడేళ్లు దాటినా ఇప్పటికీ..పూర్తికాలేదు. ఈ భవనాన్ని సకరాలంలో పూర్తి చేసి కాలేజీకి అప్పగిస్తే....సెమినార్ హాల్ సహా... నాలుగు అదనపు తరగతి గదులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అంతేM ఎదు మార్కెట్‌లో

చదువుకునేందుకు మంచి అవకాశం: అనురాధ, ప్రిన్సిపాల్, సరూర్‌నగర్ కాలేజీ

మంచి డిమాండ్ ఉన్న ఎలక్ట్రికల్ టెక్నిషియన్ కోర్సును పరిచయం చేసే అవ కాశం దక్కుతుంది. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ సహా టై, బెల్ట్, షూస్ సాధారణంగా ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులు ఏటా రూ.1.50 నుంచి రూ.2.50 లక్షలకుపైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. కానీ ఇక్కడ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా ఉత్తమ విద్యను అందిస్తుంది. అంతేకాదు..కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు నిపుణులైన అధ్యాపకులతో బోధన అందించడంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్స్ బుక్స్ సహా రెండు జతల బట్టలు, టై, షూస్‌లను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాల పంపిణీ కూడా పూర్తైంది. జూన్ 15 నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకునేందుకు మంచి అవకాశం. పైసా ఖర్చు లేకుండా పూర్తిగా ప్రభుత్వ ఖర్చులతో నచ్చిన కోర్సులో చేరి, చదువుకునే అవకాశం ఉంది. సుసిక్తులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. కాలేజీలో చదువుకున్న విద్యార్థులు ఉత్తమమార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. పరిమితంగా సీట్లు ఉన్నాయి. పదో తరగతిలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ఓటర్ జాబితా పరిశీలన , పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై, నల్లగొండ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి , పార్టీ సభ్యత్వాల జిల్లా ఇంఛార్జి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ , ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి , డా.గాదరి కిశోర్ కుమార్ , జెడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి ,కంచర్ల కృష్ణారెడ్డి , బూత్ లెవల్ పార్టీ ఏజెంట్ లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు.